క్లుప్తంగా

బాట సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామ సమీపంలో వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంతోపాటు మండలంలోని కలుగొట్ల, భీమునిపాడు, రేవనూరు, కంపమల్ల, గుళ్లదూర్తితోపాటు దొర్నిపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు ఉచితంగా ఛావా చిత్ర ప్రదర్శన



ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న సభ్యులు

బేతంచెర్ల: మన ఊరు–మన గుడి సభ్యులు బుధవారం సుమారు 400 మంది విద్యార్థులకు శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ పేరు మీదుగా తీసిన ఛావా సినిమాను ఉచితంగా చూపించారు. శంభాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటం, త్యాగాలు నేటి తరం పిల్లలకు తెలియాలనే ఉద్దేశంతో విద్యార్థులకు సినిమాను చూపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మన ఊరు- మన గుడి సభ్యులను ధార్మిక సంఘాల సభ్యులు గౌరి హుసేన్ రెడ్డి, నాగ మోహన్, గుండా జగన్ మోహన్ రావు, రామ్మూర్తి అభినందించారు.

వేలంలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఈఓఆర్డీ

బనగానపల్లె: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పలుకూరులో సంత మార్కెట్, బండ్ల మెట్లలకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో పంచాయతీకి రూ.2.23 లక్షల ఆదాయం పెరిగిందని ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్ కుమార్‌రెడ్డి తెలిపారు. దిన వారపు మార్కెట్ రూ.77,500, బండ్ల మెట్ల రూ.17.52 లక్షలకు గ్రామానికి చెందిన ఎం. బాలమద్దిలేటి దక్కించుకున్నట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2.23 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. బహిరంగ వేలంలో మొత్తం నలుగురు పాటదారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



కార్ణాటి హర్షవర్ధన్ రెడ్డి మృతదేహం

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని గ్రామంలో ఓవర్ వాటర్ ట్యాంక్ నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన కర్ణాటి హర్షవర్ధన్ రెడ్డి (30) మూడు రోజుల క్రితం ఎగ్గొని గ్రామంలోని అక్క శ్రావణి, బావ రవీంద్రరెడ్డి ఇంటికి వచ్చాడు. మద్యానికి బానిసై ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతినికి అక్క, బావ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగన్న తెలిపారు.

పీడియాట్రిక్‌లో గోల్డ్ మెడల్



కళ్యాణ్‌కుమార్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఈద్గానగర్ కాలనీకి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వై.ప్రసాదరావు, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు కళ్యాణ్‌కుమార్ ఎంబీబీఎస్ ఎండీ పీడియాట్రిక్‌లో యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినట్లు బుధవారం కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను 10వ తరగతి వరకు నెహ్రూ ఉన్నత పాఠశాల, ఇంటర్ విజయవాడ, ఎంబీబీఎస్ కర్నూలు మెడికల్ కళాశాల, ఎండీ పీడియాట్రిక్ కాకినాడ రంగరాయ కళాశాలలో పూర్తి చేసినట్లు చెప్పారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. కళ్యాణ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

విశ్వసనీయతే వైఎస్సార్‌సీపీ అజెండా

- జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- వాడవాడలా సంబరాలు



బనగానపల్లెలో పార్టీ జెండా ఆవిష్కరణలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: విశ్వసనీయత, విలువలే వైఎస్సార్‌సీపీ అజెండా అని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం కాటసాని స్వగృహంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, మెడికల్ కళాశాలల ఏర్పాటు, చేయూత, పింఛన్లు, పేదలకు పక్కా ఇళ్లు ఇలా అనేక పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. అయితే చంద్రబాబు నాయుడు మోసపూరిత మాటలు నమ్మిన ప్రజలు కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం చంద్రబాబుకు అలవాటు అని ఎద్దేవా చేశారు. ప్రజలు తాము చేసిన తప్పును తెలుసుకుని పేదల పక్షాన ఉన్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు వదులుకున్నామా అని బాధపడుతున్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి ఉంటుందని స్పష్టం చేశారు. పేదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాడుతునే ఉంటారని, విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దనికొండ నాగేశ్వరరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పూజారి శ్రీనివాసులు, నాయకులు అబ్దుల్ ఖైర్, అత్తార్‌జాహెద్, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, బండిబ్రహ్మానందరెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, వడ్డె సుబ్బరాయుడు, మనోహర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, గున్నాల శేష, జశ్వంత్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణ, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధం



బేతంచెర్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

బేతంచెర్ల: ప్రజల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్లు ముర్తుజావలీ, ఖాజా హుసేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, గూని నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నంద్యాలలో జరిగిన వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్‌రెడ్డి, హరి, నిరంజన్, మురళీ, వెంకిరెడ్డి, వలిబాషా, ఖాజా, సలీమ్, అజ్మతుల్లా, భాస్కర్, నడ్డిశ్రీను, ఎద్దులన్న పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



డోన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. , మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు పసాద్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని 9 నెలలుగా మభ్యపెడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి వందనం, వసతి, విద్యాదీవెనల కింద విద్యార్థుల తల్లులకు నయాపైసా ఆర్థిక సహాయం అందజేయడం లేదన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని విస్మరించిన విషయాన్ని ప్రజలందరూ తెలుసుకున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం యువతను మభ్యపెట్టే ప్రకటనలు చేస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కురుకుంద హరి పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

డోన్ పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు ఓబులాపురం సుధాకర్, గార్లదిన్నె రామసుబ్బయ్య, ధారా ప్రతాప్‌రెడ్డి, మహేంద్రనాయుడు, సోమశేఖర్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, మహేశ్వరరెడ్డి, వంశీ తదితరులు జెండా ఆవిష్కరించారు.

సంబరాలు

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు పాలుట్ల రఘురాం, రఫి, మేడా రఘు, మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ బంగారు జయచంద్ర, పెయింటర్ వెంకటేష్, కాలేషా, మేకల నాగరాజులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

కోవెలకుంట్ల: నిర్మాణ దశలో ఆగిన పక్కాగృహాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు సాయం అందజేస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. లబ్ధిదారులకు గతంలో వచ్చిన బిల్లుతో పాటు ఒక్కో ఎస్సీ లబ్ధిదారునికి రూ. 50 వేలు, ఎస్టీకి రూ.75 వేలు, ఇదే కేటగిరిలోని చెంచులకు రూ.లక్ష, బీసీ కేటగిరిలో చేనేత లబ్ధిదారులకు రూ. 50 వేల చొప్పున అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్లను ఆయా గ్రామ సచివాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

కొలిమిగుండ్ల: పీఎంఏవై పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి బుధవారం తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సాయం అందిస్తుందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మంజూరు చేస్తుందని చెప్పారు. నిర్మాణాలు మధ్యలో నిలిచిన గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రాలను హౌసింగ్ అధికారులకు అందజేయాలని తెలిపారు. మండలంలో బీసీ లబ్ధిదారులు 412 మంది, ఎస్సీలు 389, ఎస్టీ లబ్ధిదారులు 35 మంది ఉన్నారన్నారు. అర్హులైన వారికి ఈనెల 20 నుంచి అదనపు ఆర్థిక సాయం అందుతుందన్నారు.

త్వరితగతిన పూర్తి చేయండి

సంజామల: మండలంలో వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న గృహాలను త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు తెలిపారు. గత ఏడాది మంజూరైన గృహాల్లో ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తుందని చెప్పారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

కొలిమిగుండ్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని వాల్మీకి కాలనీకి నీటి సరఫరా అందించే పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేసినట్లు సర్పంచ్ శివరాముడు బుధవారం తెలిపారు. రెండు రోజుల క్రితం పైప్ పగిలిపోయి లీకేజీతో నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. ప్రజలకు నీటి సమస్య ఏర్పడకూడదనే ఉద్దేశంతో పైప్‌లైన్‌కు రిపేరు చేసి యథావిధిగా నీటి సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి బుధవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు https:// apms.apcfss.in లేదా https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనులను వేగవంతం చేయాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిసిన దృష్ట్యా అడిగిన వారందరికీ పనులు చూపించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనులు జరిగే ప్రదేశాల్లో నీడ, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు

ప్యాపిలి: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రిన్సిపాల్ మధు కుమార్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థులు మహేశ్, సుమన్, రూప వాపోయారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్‌పై సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. 2016–19లో డిగ్రీ చదివిన తమకు ఇంతవరకు సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. సర్టిఫికెట్లు అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారని తెలిపారు. దూరవిద్య విద్యార్థులతో సైతం డబ్బులు తీసుకుని పరీక్షలు నిర్వహించకుండా, సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన మద్దిలేటి, సూరిబాబు పనినిమిత్తం బైక్‌పై ఆర్ఎస్ రంగాపురం గ్రామం వైపు వెళ్తున్నారు. వీరిని ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మద్దిలేటి, సూరిబాబు గాయపడ్డారు. కాగా ప్రమాద స్థలం వద్దకు వస్తున్న అదే గ్రామానికి చెందిన వేణు ద్విచక్ర వాహనం బోల్తా పడి గాయపడ్డాడు. ముగ్గురిని బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ప్లాటు ఆక్రమణకు టీడీపీ నాయకుడి దౌర్జన్యం



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళ

ప్యాపిలి: ఎర్రగుంట్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బత్తుల రమేశ్ రెడ్డి ప్యాపిలి సమీపంలోని తన భూమిని ఆక్రమించేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని బాధిత మహిళ, రాష్ట్ర ఎరుకల సేవా సంఘం ఉపాధ్యక్షురాలు మనోరమ బుధవారం ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆమె వివరాల మేరకు.. డోన్ పట్టణానికి చెందిన మర్రి గోవిందరాజులు ద్వారా 293 సర్వే నంబర్‌లోని ఏడు సెంట్లను తాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే సదరు ప్లాటుపై కన్నేసిన ఎర్రగుంట్లపల్లి రమేష్ రెడ్డి ప్లాట్ వదిలి వెళ్లకపోతే చంపుతానని ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇటీవల ప్లాట్ వద్దకు వచ్చి తనను కులం పేరుతో దూషించినట్లు తెలిపింది. ప్యాపిలికి చెందిన మరో నాయకుడు ఎరుకల మధు కుమార్‌తో కలిసి దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపించింది. అధికారులు విచారణ చేపట్టి ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కోరింది. బాధితురాలికి అండగా వివిధ గిరిజన సంఘాల నాయకులు ప్యాపిలికి తరలివచ్చారు. సీఐ, తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. ఏపీవైఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సురసుర రామచంద్రుడు, రాయలసీమ కమిటీ సభ్యుడు సూర్యుడు, జిల్లా అధ్యక్షుడు పెద్దరాముడు మాట్లాడుతూ.. గిరిజనుల ఆస్తులకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



హెచ్ కొట్టాల రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, రైల్వే అధికారులు

బేతంచెర్ల: రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. బుధవారం గుంతకల్ రైల్వే సెక్షన్ ఇంజినీర్ సత్యనారాయణ, భూసేకరణ అధికారి వెంకటేశ్వరప్పతో కలిసి హెచ్.కొట్టాలలో భూములు కోల్పోతున్న 21 మంది రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయ రహదారిలో నిర్మించే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జికి 2.85 ఎకరాల భూమి అవసరం ఉందని తెలిపారు. ఎకరాకు రూ. 19 లక్షల వరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలపగా, రైతులు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలని విన్నవించారు. రైతుల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన సమాధానం ఇచ్చారు. ఆర్ఐ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు విజయలక్ష్మి, సర్వేయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ మీటింగ్‌లతో మధ్యాహ్నం వరకే పాఠశాలలు



అంకిరెడ్డిపల్లెలో మధ్యాహ్నం తర్వాత మూతబడిన పాఠశాల

కొలిమిగుండ్ల: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించడంతో బుధవారం మధ్యాహ్నం వరకే పాఠశాలలు నిర్వహించారు. మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులను ఇళ్లకు పంపి పాఠశాలలకు తాళాలు వేశారు. ఒంటి గంటకు కాంప్లెక్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. మండలంలో కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. గతంలో పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే వెళ్లేవారు. సాధారణంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించాల్సి ఉంది. అయితే ఈసారి ముందుగానే సమావేశాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగింది. కాంప్లెక్స్ మీటింగ్ జరిగే పాఠశాలలకు చేరుకునేందుకు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశాలు జరిగే పాఠశాల వద్ద ఫేసియల్ యాప్‌లో తప్పక హాజరు వేయాలనే నిబంధన విధించారు. అది కూడా పది అడుగుల దూరంలో ఉంటేనే లొకేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయులు అష్టకష్టాలు ఎదుర్కొని చేరుకోవాల్సి వచ్చింది.

ప్రమాదవశాత్తు అరటితోట దగ్ధం



దగ్ధమైన అరటితోటలో రైతు రామకృష్ణ

ప్యాపిలి: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో బుధవారం ప్రమాదవశాత్తు అరటితోటకు నిప్పంటుకుంది. గోపాలనగరం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతు రామకృష్ణాపురంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని ఎకరాకు రూ.70 వేలు పెట్టుబడి పెట్టి అరటి సాగు చేస్తున్నాడు. అరటి చెట్లకు ఇటీవలే కాయలు కాస్తున్నాయి. దీంతో దిగుబడి బాగా వస్తుందని రైతు ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అరటితోటకు నిప్పంటుకుని చెట్లన్నీ దగ్ధమయ్యాయి. ఉదయం తోటకు వెళ్లి చూడగా కళ్ల ముందే తోట కాలిపోతుండడంతో గుండెలు బాదుకున్నాడు. డోన్ నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే తోట కాలిబూడిదైంది. రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్యాపిలి: జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి అకాల మరణం బాధాకరమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీకి ప్యాపిలి మండలంలో పెద్దదిక్కుగా ఉన్న శ్రీరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, బోరెడ్డి రాము, బోరెడ్డి గోపి, బొర్రా మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రజనీరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.



బేతంచెర్ల మెయిన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

విద్యార్థి దశలో పదో తరగతి కీలకం

బేతంచెర్ల: విద్యార్థి దశలో 10వ తరగతి కీలకమని, ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలను ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ సోమశేఖర్ సూచించారు.


బుధవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం అబ్రహ్మాం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులు అందమైన చేతిరాతతో స్పష్టంగా సమాధానాలు రాయగలిగితే మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు.

పాఠశాలలో సరస్వతీ పూజ

సంజామల: మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతరావమ్మ, ఉపాధ్యాయులు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



రహదారికి ఇరువైపులా కనిపించని చెట్లు.



కొత్త బస్టాండ్ వద్ద కనిపించని పచ్చదనం

పచ్చని చెట్టు.. కనిపిస్తే ఒట్టు

ప్యాపిలి: నాలుగు వరుసల రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు కనిపించకపోవడంతో మండల కేంద్రం ప్యాపిలి ఓ ఎడారి ప్రాంతాన్ని తలపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.18 కోట్లతో నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించాల్సి వచ్చింది. అయితే రహదారి పనులు పూర్తయ్యాక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాల్సిన అధికారులు, ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం రద్దీతో కళకళలాడే రహదారి చెట్లు లేక వెలవెలబోతోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు చెట్ల కింద నీడలో సేదతీరే అవకాశం కూడా లేకపోయింది. మార్చి నెలలోనే భానుడి భగభగలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఏప్రిల్, మేలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. చెట్లు లేకపోవడంతో చల్లటి గాలిలేక ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.18 కోట్లతో రహదారిని అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం కనీసం మొక్కలు నాటలేకపోయిందని అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.